# సిద్దిపేటలో హరీశ్‌రావు ఘనవిజయం

**83,025 ఓట్ల భారీ మెజార్టీ**



సిద్దిపేట, డిసెంబర్ 3: సిద్దిపేట బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్‌రావు 83,025 ఓట్ల తేడాతో తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణపై ఘనవిజయం సాధించారు. సిద్దిపేట నియోజకవరంలో మొత్తం 2,33,733 ఓట్లు ఉండగా, 1,78,420 ఓట్లు పోలయ్యాయి. ఆదివారం వెల్లడించిన ఫలితాల్లో రౌండ్లవారీగా ఆయా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు...

**సిద్దిపేట నియోజకవర్గంలో రౌండ్ల వారీగా వివిధ పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లు**

| రౌండ్ | బీఆర్ఎస్ | కాంగ్రెస్ | బీజేపీ | బీఎస్పీ | ఆధిక్యం |
|---|---|---|---|---|---|
| 1 | 6924 | 666 | 615 | 509 | 6258 |
| 2. | 5637 | 1364 | 980 | 793 | 4313 |
| 3. | 6430 | 1219 | 926 | 453 | 5211 |
| 4. | 4731 | 1062 | 1009 | 1087 | 3669 |
| 5. | 5734 | 1205 | 1652 | 896 | 4082 |
| 6. | 5718 | 1515 | 1497 | 879 | 4203 |
| 7. | 4910 | 1222 | 1754 | 706 | 3156 |
| 8. | 5155 | 1013 | 1871 | 387 | 3284 |
| 9. | 3681 | 735 | 1891 | 330 | 1790 |
| 10. | 4565 | 1358 | 1018 | 393 | 3207 |
| 11. | 4713 | 1098 | 1834 | 456 | 2879 |
| 12. | 3986 | 1012 | 1782 | 482 | 2204 |
| 13. | 5252 | 911 | 1160 | 656 | 4092 |
| 14. | 5784 | 1352 | 706 | 1151 | 4432 |
| 15. | 5240 | 1120 | 863 | 1666 | 3574 |
| 16. | 5193 | 779 | 658 | 1702 | 3491 |
| 17. | 5827 | 1189 | 623 | 1154 | 4638 |
| 18. | 5590 | 1285 | 476 | 1357 | 4233 |
| 19. | 5102 | 1756 | 749 | 789 | 3346 |
| 20. | 3837 | 648 | 268 | 468 | 3189 |

## సిద్దిపేట ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన హరీశ్‌రావు

సిద్దిపేట, డిసెంబర్ 3 : తనను 83,025 ఓట్ల మెజార్టీతో గెలిపించిన సిద్దిపేట ప్రజలకు హరీశ్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గంలో మరోసారి ప్రత్యర్థుల డిపాజిట్లు గల్లంతు చేసి తనకు భారీ మెజార్టీని ప్రజలు అందించారని చెప్పారు. సిద్దిపేటలో తాను ఒక్కసారి మాత్రమే ప్రచారం చేసినా ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించారని తెలిపారు. తాను చేసిన అభివృద్ధికి సిద్దిపేట ప్రజలు మార్కులు వేశారని చెప్పారు. తన గెలుపునకు అనునిత్యం కష్టపడి పనిచేసిన నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



విజయ దరహాసంతో గెలుపొందిన ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి



పల్లాతో కలిసి సంబురాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# జనగామలో 'పల్లా'కే జనం పట్టం

**బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి 16,863 ఓట్ల మెజార్టీ**

జనగామ, డిసెంబర్ 03 (నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లాలోని మూడు అసెంబ్లీ స్థానాలకు రెండింట్లో గులాబీ జెండా ఎగిరింది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో ముచ్చటగా మూడోసారి గులాబీ గుబాళించింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014 ఎన్నికలు సహా 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో రెండు పర్యాయాలు జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌ను ఆదరించిన ప్రజలు కాంగ్రెస్ హవాలోనూ జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలు పార్టీ అభ్యర్థులను అక్కున చేర్చుకున్నారు. ఆదివారం జనగామ రూరల్ మండలం పెంబర్తి పాత విద్యాభారతీ ఇంజినీరింగ్ కళాశాల (వీబీఐటీ)లో జరిగిన జనగామ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై 16,418 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి తన సమీప ప్రత్యర్థి సింగపురం ఇందిరపై 7,779 ఓట్ల మెజార్టీ సాధించారు. జనగామలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లాకు మొత్తం 98,557 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరికి 82,139 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంత్‌రెడ్డి మాత్రం కేవలం 7,595 ఓట్లకు పరిమితమయ్యారు. జనగామ సెగ్మెంట్‌లో మొత్తం 20 రౌండ్లలో జరిగిన ఓట్ల లెక్కింపులో ఆఖరి రౌండ్ మినహా ప్రతి రౌండ్‌లోనూ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా ఆధిక్యతను కనబరిచారు. ఇక్కడ తొలి రౌండ్ నుంచే 1304 ఓట్ల లీడ్‌తో ప్రారంభమైన జనగామ అభ్యర్థి ఎన్నికల ఫలితం 19 రౌండ్ల వరకు ఏ మాత్రం తగ్గకుండా కొనసాగింది. చివరిదైన ఒక్క 20వ రౌండ్‌లోనే కాంగ్రెస్ అభ్యర్థికి 435 ఓట్ల స్వల్ప ఆధిక్యత లభించింది. జనగామ జిల్లాలో మూడు నియోజకవర్గాలకు రెండు స్థానాల ఓట్ల లెక్కింపు ఫలితాల్లో మధ్యాహ్నం వరకు ట్రెండ్ బీఆర్ఎస్ వైపు కొనసాగుతుండటంతో జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కౌంటింగ్ కేంద్రం నుంచి మధ్యలోనే వెనుదిరిగారు. స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి ఇందిర మాత్రం కౌంటింగ్ కేంద్రానికి దూరంగా ఉండి తమ క్యాడర్‌ను పంపించగా, ఫలితాల సరళిని గమనించిన నాయకులు, కార్యకర్తలు మధ్యలోనే వెళ్లి పోయారు. ఇక కడియం శ్రీహరి గెలుపు ఖాయమని తేలిన తర్వాత కౌంటింగ్ కేంద్రానికి చేరుకొని లెక్కింపు సరళిని పరిశీలించి రిటర్నింగ్ అధికారి వాసాల రామ్మూర్తి నుంచి గెలుపుపత్రాన్ని అందుకున్నారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రాలను స్వీకరించారు.

**రౌండ్‌రౌండ్‌కు 'పల్లా' ఆధిక్యత..**

జనగామ అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు క్షణక్షణం ఉత్కంఠ భరితంగా పోస్టల్ ఓట్ల లెక్కింపు మొదలు తొలి ఐదు రౌండ్ల వరకు మెజార్టీపై ఆకస్తి నెలకొన్నది. అయితే ఇక్కడ మొత్తం 20 రౌండ్లకు చివరి 20వ రౌండ్ మినహా మిగిలిన 19 రౌండ్లలోనూ బీఆర్ఎస్ అభ్యర్థి ఆధిక్యతను కనబరిస్తూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. మొదటి రౌండ్‌లో పల్లా 5578 ఓట్లు సాధిస్తే, కాంగ్రెస్ అభ్యర్థికి 4274 ఓట్లతో పరిమితమై 1304 లీడ్‌తో బీఆర్ఎస్ బోణీ కొట్టింది. రెండోరౌండ్‌లో బీఆర్ఎస్‌కు 5797, కాంగ్రెస్‌కు 4112 ఓట్లతో బీఆర్ఎస్ 2989 మెజార్టీ, మూడో రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 5293, కాంగ్రెస్‌కు 4311 ఓట్లతో 3971 మెజార్టీ, 4వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 4961, కాంగ్రెస్‌కు 3907 ఓట్లతో బీఆర్ఎస్‌కు 5032 మెజార్టీ, 5వ రౌండ్‌లో బీఆర్ఎస్ 6079, కాంగ్రెస్ 3770 ఓట్లతో 7340 మెజార్టీ, 6వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 4934, కాంగ్రెస్‌కు 3634 ఓట్లతో బీఆర్ఎస్ 8640ఓట్ల మెజార్టీ, 7వ రౌండ్‌లో బీఆర్ఎస్ 5299, కాంగ్రెస్ 4561 ఓట్లతో బీఆర్ఎస్ 9378 మెజార్టీ, 8వ రౌండ్‌లో బీఆర్ఎస్ 5123, కాంగ్రెస్ 3808 ఓట్లతో10,693 మెజార్టీతో దూసుకుపోయింది. 9వ రౌండ్‌లో బీఆర్ఎస్ 5262, కాంగ్రెస్ 4075 ఓట్లతో 11,880 మెజార్టీ, 10వ రౌండ్‌లో బీఆర్ఎస్ 4851, కాంగ్రెస్‌కు 3828 ఓట్లు రాగా బీఆర్ఎస్‌కు 12,903 ఓట్ల మెజార్టీకి చేరువైంది. 11వ రౌండ్‌లో బీఆర్ఎస్ 4229, కాంగ్రెస్ 3103 ఓట్లతో బీఆర్ఎస్ మెజార్టీ 14,029కు చేరింది. 12వ రౌండ్‌లో బీఆర్ఎస్ 4854, కాంగ్రెస్ 4752 ఓట్లతో బీఆర్ఎస్‌కు 14,131 మెజార్టీ, 13వ రౌండ్‌లో బీఆర్ఎస్ 5106, కాంగ్రెస్ 4723ఓట్లతో బీఆర్ఎస్ 14,514, 14వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 4170, కాంగ్రెస్‌కు 3638 ఓట్లతో బీఆర్ఎస్ మెజార్టీ 15,066కు చేరింది. 15వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 4269ఓట్లు, కాంగ్రెస్‌కు 3979 ఓట్లు రాగా, బీఆర్ఎస్ మెజార్టీ 15,346కు, 16వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 4405 ఓట్లు, కాంగ్రెస్‌కు 3842ఓట్లు రాగా, బీఆర్ఎస్ మెజార్టీ 15,909కి, 17వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 4789, కాంగ్రెస్‌కు 4453ఓట్లు రాగా, బీఆర్ఎస్ మెజార్టీ 16,245కు, 18వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 4274, కాంగ్రెస్‌కు 3960 ఓట్లు రాగా, బీఆర్ఎస్ మెజార్టీ 16,559కి చేరగా, 19వ రౌండ్‌లో బీఆర్ఎస్‌కు 4919 ఓట్లు, కాంగ్రెస్‌కు 4615ఓట్లతో 16,863 మెజార్టీ సొంతం చేసుకున్నది. ఇక చివరి 20వ రౌండ్‌లో మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థి పల్లాకు 4359 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరికి 4794 ఓట్లు వచ్చి ఒక్క ఈ రౌండ్‌లోనే కాంగ్రెస్‌కు 435 స్వల్ప ఓట్ల మెజార్టీ దక్కింది.

# 'మల్లన్న'ను దర్శించుకున్న భక్తులు

చేర్యాల, డిసెంబర్ 3 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో నిండిపోయింది. 'మల్లన్న స్వామి.. మమ్మేలు స్వామి' అంటూ భక్తుల నామస్మరణతో శైవక్షేత్రం పులకరించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొమురవెల్లి క్షేత్రానికి 15 వేల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో అలూరి బాలాజీశర్మ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతోపాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతోపాటు మట్టి పాత్రలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మల్లన్న ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్ శేఖర్, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



మల్లన్న ఆలయం వద్ద భక్తుల రద్దీ



చేర్యాలలో సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు



కొమురవెల్లి : గురువన్నపేటలో సంబురాలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

# 'పల్లా' గెలుపుతో సంబురాలు

చేర్యాల, డిసెంబర్ 3 : జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఘన విజయం సాధించడంతో ఆదివారం చేర్యాల పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

**కొమురవెల్లిలో..**

కొమురవెల్లి, డిసెంబర్ 3 : బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపుతో కొమురవెల్లి మండలవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పటాకులు కాల్చి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మద్దూరులో..**

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 3: జనగామ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందడంతో మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ జీడికంటి సుదర్శన్, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఉపసర్పంచ్ బెడద కుమారస్వామి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్ నాయకులు కాసర్ల కనకరాజు, మానెపల్లి ప్రభాకర్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు : లద్నూర్‌లో సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు